క్లుప్తంగా

ఘనంగా మహేశ్వరి దేవి విజయోత్సవం

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ టౌన్‌షిప్ సెక్టార్-6 శివాలయ ప్రాంగణంలోని శ్రీమహేశ్వరి దేవి విజయోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు.సామూహిక లక్ష కుంకుమార్చనలో మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. సాయంత్రం ఆధ్యాత్మిక ప్రసంగాలు నిర్వహించారు.ఆలయ కమిటీ ప్రతినిధులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి కిక్‌బాక్సింగ్ పోటీల ట్రోఫీ ఆవిష్కరణ



ట్రోఫీని ఆవిష్కరిస్తున్న కరణంరెడ్డి తదితరులు

గాజువాక : ఈ నెల 17న గాజువాకలో నిర్వహించనున్న 13వ రాష్ట్రస్థాయి కిక్ బాక్సింగ్ పోటీల ట్రోఫీని బీజేపీ గాజువాక కన్వీనర్ కరణంరెడ్డి నర్సింగరావు శుక్రవారం ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ ఈ పోటీల్లో గెలుపొందినవారు వచ్చేనెల ఢిల్లీలో నిర్వహించనున్న జాతీయ స్థాయి పోటీలకు హాజరవుతారని తెలిపారు. కార్యక్రమంలో కిక్ బాక్సింగ్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు గంటా నూకరాజు, ప్రతినిధులు పాల్గొన్నారు.

విదేశీ విద్య, పాస్‌పోర్టులపై అవగాహన

అగనంపూడి: విదేశీ విద్యనభ్యసించడం, వాటికి అనుగుణంగా పాస్‌పోర్టు, వీసాలు పొందడంపై దువ్వాడ విజ్ఞాన్ ఫార్మా కళాశాల విద్యార్థులకు అవగాహన కల్పించారు. విజ్ఞాన్ ఫార్మా కళాశాల, లియో గ్లోబల్ ఓవర్‌సీస్ ఆధ్వర్యంలో విదేశీ విద్య, పాస్‌పోర్టు అంశాలపై ఏర్పాటు చేసిన కార్యక్రమంలో గ్లోబల్ ఓవర్‌సీస్ ప్రతినిధి వాసవి కోన మాట్లాడారు. విదేశాల్లో విద్యార్థుల ఉన్నత చదువులకు గల అవకాశాలను వివరించారు. ఫార్మా కళాశాల ప్రిన్సిపాల్ వై.శ్రీనివాసరావు, శిక్షణ, ఉపాధి కల్పన హెచ్‌వోడీ వసుధ తదితరులు పాల్గొన్నారు.

లఘు చిత్ర పోటీల్లో నడుపూరు విద్యార్థుల ప్రతిభ

పెదగంట్యాడ: జాతీయ శక్తి వనరుల పరిరక్షణ వారోత్సవాలలో భాగంగా నిర్వహించిన రాష్ట్రస్థాయి లఘు చిత్ర పోటీల్లో నడుపూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు సత్తా చాటారు. ఈ పోటీల్లో తమ పాఠశాల నుంచి వై.కార్తీక్, ఎస్.ధనలక్ష్మి, ఆర్.సుహానీ గీతిక, పి.అక్షర కన్సొలేషన్ బహుమతులు సాధించారని హెచ్‌ఎం రాచకొండ శ్రీనివాస్ తెలిపారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్ర శక్తి వనరుల మిషన్ రాష్ట్ర వ్యాప్తంగా 8, 9, 10 తరగతి విద్యార్థుల నుంచి లఘు చిత్రాలను ఆహ్వానించిందన్నారు. ఈ పోటీల్లో తమ విద్యార్థులు విజేతలుగా నిలిచారని, వారికి ఈ నెల 20న విజయవాడలో బహుమతులు అందజేస్తారని తెలిపారు. ఉపాధ్యాయులు వెంకటలక్ష్మి, నరసింహను అభినందించారు.

ప్రజా భాగస్వామ్యంతో 'ఉక్కు' పరిరక్షణ

కూర్మన్నపాలెం: మహనీయుల త్యాగాలతో సాధించుకున్న విశాఖ ఉక్కు కర్మాగారాన్ని పరిరక్షించుకోవడం అందరి బాధ్యత అని ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకులు అన్నారు. ప్రజా భాగస్వామ్యంతో ఉద్యమాన్ని ఉధృతం చేసి, స్టీల్‌ప్లాంట్‌ను పరిరక్షించుకుంటామన్నారు. కూర్మన్నపాలెం కూడలి వద్ద చేపట్టిన రిలే నిరాహార దీక్షల్లో 1037వ రోజు, శుక్రవారం సంస్థకు చెందిన పలు విభాగాల కార్మికులు పాల్గొన్నారు.

స్టేషన్ కన్సల్టేటివ్ కమిటీ సభ్యుల నియామకం

గాజువాక : దువ్వాడ రైల్వే స్టేషన్ కన్సల్టేటివ్ కమిటీ (ఎస్‌సీసీ) సభ్యులుగా బీజేపీ సీనియర్ నాయకులు బాటా శ్రీనివాస్, శశిధరణ్ పిళ్లై, మంత్రి పట్నాయక్, సియ్యాద్రి అప్పలరాజు నియమితులయ్యారు. ఈ మేరకు బీజేపీ గాజువాక కో-ఆర్డినేటర్ కరణంరెడ్డి నర్సింగరావు వారికి శుక్రవారం నియామకపత్రాలను అందజేశారు. అనంతరం మాట్లాడుతూ దువ్వాడ రైల్వే స్టేషన్ ఆధునికీకరణకు ప్రధాన మోదీ ఇటీవల రూ.26 కోట్ల నిధులను కేటాయించారన్నారు. రాష్ట్ర ప్రభుత్వం స్థలం చూపించిన వెంటనే ఆ నిధులతో అభివృద్ధి పనులు ప్రారంభమవుతాయన్నారు.

హృదయం.. పదిలం





అగనంపూడి ఆస్పత్రిలో పరికరాలు

నాడు

గతంలో ఛాతీ నొప్పి అనిపిస్తే గ్యాస్ట్రిక్, కండరాలు నొప్పి లేదా ఒత్తిడి వల్ల వచ్చిన నొప్పిగా భావించి సరిపెట్టుకొని ఒకటి రెండు రోజులు మందులు వాడి వదిలేసేవారు. గుండె నొప్పి వచ్చాక చివరి క్షణంలో గంట ప్రయాణం చేసి కేజీహెచ్‌కు వెళ్లే సమయం లేక కార్పొరేట్ ఆస్పత్రికి వెళ్లి రూ.30వేల నుంచి 50వేలు చెల్లించి గుండె జబ్బు నిర్ధారణ పరీక్షలు చేయించుకునేవారు. ఆర్థిక స్థోమత లేనివారు అత్యవసరంగా పెద్దాస్పత్రికి బయల్దేరినా దారిలోనే ప్రాణాలు కోల్పోయిన విషాద ఘటనలు ఉండేవి.

నేడు

ఛాతిలో నొప్పి, మంట అనిపిస్తే అగనంపూడి ఆస్పత్రికి వెళ్తే ముందుగా ఈసీజీ తీస్తారు. ఈసీజీలో తేడా అనిపిస్తే వెంటనే ఈసీసీ యూనిట్‌ను ఉపయోగించి స్క్రీనింగ్ టెస్ట్ చేస్తున్నారు. ఒకవేళ గుండె నొప్పిగా నిర్ధారణ జరిగితే వెంటనే రూ.30వేల విలువైన ఇంజక్షన్ ఇచ్చి ప్రత్యేక అంబులెన్స్‌లో కేజీహెచ్‌కు తీసుకువెళ్తున్నారు. ప్రాథమిక దశలో గుర్తించడం వల్ల ఛాతీలో చిన్నపాటి తేడాలు ఉన్నా వెంటనే చికిత్స ప్రారంభించేందుకు అవకాశం కలుగుతోంది.

- అగనంపూడి ఏరియా ఆస్పత్రిలో ఈసీసీ యూనిట్
- ఛాతీనొప్పి బాధితులకు అత్యవసర సేవలు
- స్థానికంగా గుండెపోటు నిర్ధారణ పరీక్షలు
- వ్యాధి గుర్తిస్తే రూ.30వేల ఇంజక్షన్
- ప్రథమ చికిత్స అనంతరం కేజీహెచ్‌కు తరలింపు



ఇది కదా అభివృద్ధి

అగనంపూడి: పేదల వైద్యానికి పెద్ద పీట వేస్తున్న వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం మరో ముందడుగు వేసింది. కోవిడ్ తరువాత గుండె సంబంధిత వ్యాధులు అధికం కావడంతో ప్రభుత్వం స్పందించింది. ఉమ్మడి విశాఖలో నాలుగు చోట్ల ఎమర్జెన్సీ కార్డియాక్ కేర్ (ఈసీసీ) యూనిట్లు ప్రారంభించింది. రెండు మాసాల క్రితం స్టెమీ ప్రాజెక్టు పేరుతో ఏర్పాటు చేయగా.. తరువాత ఈసీసీగా పేరు మార్చారు.

ప్రాణాపాయ స్థితి నుంచి రక్షణ

అగనంపూడి ఆస్పత్రిలో సుమారు రూ. 6 లక్షల వ్యయంతో ఈసీసీ యూనిట్‌కు సంబంధించి వైద్య పరికరాలు ఏర్పాటు చేశారు. ఏఎల్ఎస్ సౌకర్యాలతో అంబులెన్స్ ఏర్పాటు చేస్తున్నారు. ఇక్కడి వైద్యులకు ఈసీసీపై ప్రత్యేక శిక్షణ ఇచ్చి సేవలు అందిస్తున్నారు. యాప్ ద్వారా కేజీహెచ్ గుండె వైద్య నిపుణులను సంప్రదించి, ప్రాథమిక చికిత్స చేసి రిఫర్ చేస్తున్నారు. గుండెనొప్పి సూచనలు ముందుగానే గుర్తించడం ద్వారా ప్రాణాపాయ స్థితి నుంచి గట్టెక్కడంతో పాటు తగిన జాగ్రత్తలు తీసుకోడానికి వీలుంటుందని స్థానికులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. రోజుకు 8 నుంచి 9 మందికి ఇక్కడ వైద్య పరీక్షలు నిర్వహించి నిర్ధారణ పరీక్షలు చేస్తున్నారు. అవసరమైన వారిని కేజీహెచ్‌కు రిఫర్ చేసి మెరుగైన సేవలు అందిస్తున్నారు.

ఎమర్జెన్సీ కార్డియాక్ కేర్ యూనిట్
నిధులు: రూ.6 లక్షలు
సమకూర్చిన వైద్యపరికరాలు
మల్టీ పారా మానిటర్, డిఫిబ్రలేటర్ ఈసీజీ మెషీన్, అధునాతన బెడ్స్



హార్ట్ పేషెంట్ల కోసం ఏర్పాటు చేసిన అధునాతన బెడ్స్



ఈసీసీ యూనిట్ పనితీరును పరిశీలిస్తున్న ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ భారతి

యాప్ ద్వారా వైద్య సేవలు



గుండె నొప్పి అనే అనుమానం వచ్చిన వెంటన ఆస్పత్రిలోని ఈసీసీ వార్డును సంప్రదించాలి. పరీక్షల తర్వాత నిర్ధారణ జరుగుతుంది. ఈ వివరాలను యాప్‌లో అప్‌లోడ్ చేసి కేజీహెచ్‌కు రిఫర్ చేస్తాం. ఇలా యాప్ ద్వారా నెలకు 2 వందల నుంచి 230 వరకు గుండె సంబంధ పరీక్షలు చేసి పంపిస్తున్నాం. ఛాతీనొప్పి నిర్ధారణ చేయడానికి కేజీహెచ్‌లోని వైద్య నిపుణులతో సంప్రదించి ప్రాథమిక చికిత్స అనంతరం అంబులెన్స్ ద్వారా అక్కడి కార్డియాలజీ విభాగానికి తరలిస్తున్నాం.

– డాక్టర్ జె.భారతి, అగనంపూడి ఏరియా ఆస్పత్రి సూపరింటెండెంట్

ప్రాణాలు దక్కాయి



ఇటీవల మల్లేశ్వరరావు అనే మా బంధువుకు ఛాతీ నొప్పి రావడంతో అగనంపూడి ఆస్పత్రికి తీసుకొచ్చాం. స్క్రీనింగ్ చేసి, గుండె జబ్బు నిర్ధారణ కావడంతో వెంటనే అంబులెన్స్‌లో కేజీహెచ్‌కు పంపించారు. మేము కేజీహెచ్‌కు వెళ్లే సరికి ఇక్కడి వైద్యులు ఈ వివరాలను అక్కడి డాక్టర్లకు తెలియజేయడంతో వెంటనే చికిత్స జరిగింది. ఆయన ప్రాణాపాయ స్థితి నుంచి బయటపడ్డారు. అదే మేము కార్పొరేట్ ఆస్పత్రులకు వెళ్తే లక్షల్లో ఖర్చయ్యేది. సమీపంలోని ప్రభుత్వాస్పత్రిలో ఇలాంటి సేవలు ఏర్పాటు చేసిన సీఎంకు కృతజ్ఞతలు.

– ఎ.అప్పారావు, పినమడక కాలనీ

ప్రైవేట్ ఆస్పత్రికి వెళ్తే వేలల్లో ఖర్చు



మా స్నేహితుడు గోపాలరావుకు ఛాతీ నొప్పి రావడంతో అగనంపూడి ఆస్పత్రికి తీసుకువచ్చాం. ఈసీజీ, ఇతర పరీక్షలు చేశారు. సాధారణ నొప్పే అని తెలియడంతో మందులు ఇచ్చారు. అవి వాడడంతో వెంటనే కోలుకున్నారు. అదే ప్రైవేట్ ఆస్పత్రికి వెళ్తే వేలల్లో ఖర్చయ్యేది. ఇప్పుడు మాకు దగ్గరలోనే గుండె సంబంధిత పరీక్షలకు ఏర్పాటు చేశారు. మాలాంటి వారికి ఎంతో ఉపయోగం.

– పొడుగు చిన్నారావు, సెక్టార్-1 కాలనీ

మళ్లీ వైఎస్సార్‌సీపీ జెండా ఎగరేస్తాం

పార్టీ గాజువాక సమన్వయకర్త ఉరుకూటి చందు



సమావేశంలో మాట్లాడుతున్న ఉరుకూటి చందు

గాజువాక : రానున్న ఎన్నికల్లో గాజువాకలో వైఎస్సార్‌సీపీ జెండాను మరోసారి ఎగరవేసే విధంగా పని చేస్తానని ఆ పార్టీ గాజువాక సమన్వయకర్త ఉరుకూటి రామచంద్రరావు (చందు) అన్నారు. గాజువాకలోని పలువురు కార్పొరేటర్లు, సీనియర్ నాయకులతో కలిసి శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి తనను సమన్వయకర్తగా నియమించడంతో తన బాధ్యత మరింత పెరిగిందన్నారు. తనపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టేందుకు పార్టీ శ్రేణులను కలుపుకొని ముందుకు సాగుతూ, పార్టీని బలోపేతం చేస్తానన్నారు. ముఖ్యమంత్రి నిర్ణయానికనుగుణంగా ఎమ్మెల్యే నాగిరెడ్డి సహకారంతో పార్టీ కార్యక్రమాలను చేపడతామన్నారు. 2024 ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీని గెలిపించి జగన్ మోహన్‌రెడ్డికి బహుమతిగా ఇస్తామన్నారు.

కార్యక్రమాలు విస్తృతం

ప్రస్తుతం 'ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలంటే..' కార్యక్రమం నడుస్తోందని, దీన్ని ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్తున్నామన్నారు. పార్టీలో ఎటువంటి విభేదాలు, వర్గాలు లేవని, అందరితోను త్వరలోనే సమావేశం నిర్వహిస్తానని తెలిపారు. ఈ నెల 21న ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి పుట్టినరోజు వేడుకలను ఘనంగా నిర్వహిస్తామన్నారు. ఆ సందర్భంగా నియోజకవర్గ స్థాయిలో ఒక కార్యక్రమం నిర్వహించడంతో పాటు ప్రతీ వార్డులో విస్తృత సేవా కార్యక్రమాలను చేపడతామన్నారు.

ఎమ్మెల్యే పూర్తి సహకారం

ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి నిర్ణయాన్ని శిరసావహించి పార్టీని బలోపేతం చేసేవిధంగా పని చేస్తామని 74వ వార్డు కార్పొరేటర్ తిప్పల వంశీరెడ్డి పేర్కొన్నారు. సమన్వయకర్తగా బాధ్యతలు తీసుకున్న చందుకు ఎమ్మెల్యే నాగిరెడ్డి సహకారం పూర్తిస్థాయిలో ఉంటుందని అన్నారు. నాగిరెడ్డి నిబద్ధత గల నాయకుడని, జగన్ మోహన్‌రెడ్డికి తొలి నుంచి వెన్నంటి నడిచారని, ఆయనే మాకు ఆదర్శమని పేర్కొన్నారు. చందును మాజీ ఎమ్మెల్యే చింతలపూడి వెంకట్రామయ్య శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు బొడ్డు నర్సింహపాత్రుడు, రాజాన రామారావు, నాయకులు గుడివాడ లతీష్, అప్పికొండ మహలక్ష్మి నాయుడు, రెడ్డి జగన్నాథం తదితరులు పాల్గొన్నారు.

రైతుబజారు ప్రతిపాదిత స్థలం పరిశీలన



రైతు బజారుకు కేటాయించిన స్థలాన్ని పరిశీలిస్తున్న మన్మధరావు, పూర్ణ తదితరులు

అగనంపూడి: అగనంపూడిలో రైతు బజారు ప్రతిపాదిత స్థలాన్ని జిల్లా హార్టికల్చర్ అండ్ అగ్రికల్చర్ అధికారి కె.మన్మధరావు పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ ఈ స్థలం జాతీయ రహదారిని ఆనుకొని ఉండటంతో అటు రైతులకు, ఇటు కొనుగోలుదారులకు అందుబాటులో ఉందన్నారు. ఇక్కడ కోల్ట్ స్టోరేజ్ కూడా ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. రాష్ట్ర ఉన్నతాధికారుల అనుమతులు మంజూరైన వెంటనే పనులు చేపట్టనున్నట్లు చెప్పారు. రాష్ట్ర బ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్, జేసీఎస్ జిల్లా కో-ఆర్డినేటర్ జి.పూర్ణానందశర్మ, గాజువాక మండల హార్టికల్చర్ అధికారి స్వాతి, వ్యవసాయాధికారి సి.రమా పద్మలత, సూపరింటెండెంట్ మల్లేశ్వరరావు, విస్తరణాధికారి త్రినాథ్, నాయకులు యలమంచిలి అప్పారావు, బి.సత్యనారాయణ, రామకృష్ణ పాల్గొన్నారు.

వల్లభరాయేశ్వరాలయంలో చోరీ




గర్భగుడి తలుపులకు ఉన్న తాళం తీసివేసిన దృశ్యం



సీసీ కెమెరాల్లో దొంగ ఆనవాళ్లు

అక్కిరెడ్డిపాలెం: జీవీఎంసీ 68వ వార్డు మింది రైల్వే ట్రాక్ పక్కనున్న శ్రీ హరిహర వల్లభరాయేశ్వర స్వామి సహిత మానసాదేవి (నాగమ్మ తల్లి) ఆలయంలో దొంగతనం జరిగింది. గురువారం అర్ధరాత్రి సుమారు 1.30 గంటల ప్రాంతంలో దొంగ తలకు, ముఖానికి పూర్తి తొడుగుతో ఆలయంలోకి ప్రవేశించి, వెండి శఠగోపం, అమ్మవారి మెడలోని తులం బంగారం పుస్తెలను దొంగిలించాడు. ఆలయం ముందున్న హుండీని పగలగొట్టి అందులో నగదు తీసుకుని ఆలయం పక్కనున్న తుప్పల్లో పడేశాడు. హుండీలో రూ.12వేల నుంచి 15 వేలు నగదు ఉంటుందని అర్చకులు తెలిపారు. శుక్రవారం ఉదయం ఆలయానికి వచ్చిన అర్చకుడు సురేష్ వల్లభ గేటు ముందు విరగ్గొట్టిన తాళాలు, గర్భగుడి గేటు తాళాలు వేసే హుక్కు విరగ్గొట్టి ఉండటాన్ని గ్రహించి గాజువాక పోలీసులకు సమాచారం అందించారు. సమాచారం అందుకున్న గాజువాక క్రైం సీఐ సూర్యనారాయణ, ఎస్‌ఐ రమణా రెడ్డి ఆలయానికి చేరుకుని వివరాలు సేకరించారు. ఆలయంలోని సీసీ కెమెరాలను పరిశీలించారు. క్లూస్ టీం వేలిముద్రలను సేకరించి పరిసర నివాసితులైన పలువురిని విచారించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టనున్నట్లు సీఐ సూర్యనారాయణ తెలిపారు.

కాంట్రాక్ట్ కార్మికుడి కుటుంబానికి పెన్షన్ మంజూరు



బాధిత కుటుంబానికి పెన్షన్ పత్రం, చెక్కు అందజేస్తున్న ఈఎస్‌ఐ మేనేజర్ రఘు

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ వైర్ రాడ్ మిల్ క్యాంటీన్‌లో పని చేస్తూ మృతి చెందిన కాంట్రాక్ట్ కార్మికుని కుటుంబానికి పెన్షన్ పత్రం అందజేశారు. గుండెపోటులో మృతి చెందిన వి.అప్పలనాయుడు కుటుంబానికి నెలకు రూ.21 వేలు పెన్షన్ మంజూరైంది. 10 నెలల ఎరియర్స్ రూ.2 లక్షలు వచ్చాయి. శుక్రవారం ఈఎస్‌ఐ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో బ్రాంచ్ మేనేజర్ రఘు చేతుల మీదుగా అప్పలనాయుడు కుటుంబానికి పెన్షన్ ఆర్డర్ కాపీ, ఎరియర్స్ చెక్కులను అందజేశారు. స్టీల్ సీఐటీయూ ప్రతినిధులు పాల్గొన్నారు.

దేశానికే దిక్సూచిగా సీఎం జగన్ పాలన

- ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి
- వార్డుల్లో విస్తృతంగా 'ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలంటే..'



73వ వార్డులో బుక్‌లెట్ ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే నాగిరెడ్డి, ఉరుకూటి చందు తదితరులు



86వ వార్డులో సంక్షేమ పథకాలు తెలిపే డిజిటల్ డిస్‌ప్లే బోర్డును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే నాగిరెడ్డి



గుడివాడ అప్పన్నకాలనీలో డిజిటల్ బోర్డును ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే నాగిరెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే నాగిరెడ్డి

కూర్మన్నపాలెం: సంక్షేమ పథకాలతో రాష్ట్రంలో పేదరికాన్ని తగ్గించి, అన్ని వ్యవస్థల్లో మార్పు తీసుకువచ్చిన సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పరిపాలన దేశానికే దిక్సూచిగా నిలిచిందని ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి అన్నారు. నాలుగున్నరేళ్ల కాలంలో విద్య, వైద్యం, వ్యవసాయం, పరిశ్రమలు ఇలా ప్రతీ రంగంలో విప్లవాత్మక మార్పులు తీసుకువచ్చారన్నారు. 86వ వార్డు భరత్‌నగర్ సచివాలయ పరిధిలో వైఎస్సార్ సీపీ వార్డు ఇన్‌చార్జి దామా సుబ్బారావు ఆధ్వర్యంలో నిర్వహించిన 'ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలంటే..' కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. వైఎస్సార్‌సీపీ జెండాను ఎగరవేసి,భరత్‌నగర్ సచివాలయ పరిధిలో జరిగిన సంక్షేమం, అభివృద్ధిని సూచించే డిజిటల్ డిస్‌ప్లే బోర్డును ఆవిష్కరించారు. అనంతరం పార్టీ నాయకులు, సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు ఇంటింటికీ తిరుగుతూ వైఎస్సార్‌సీపీ పాలనలో చేపట్టిన సంక్షేమం, అభివృద్ధిని వివరించే బుక్‌లెట్‌లను ప్రజలకు అందజేశారు. కార్యక్రమంలో వెలుగుల పరశురాముడు, చిట్టి దేముడు, చేగొండి శ్రీనివాసరావు, జేసీఎస్ కన్వీనర్ వాడపల్లి రామచంద్రరాజు, మండలాధ్యక్షులు బొడ్డ గోవింద్, సోషల్ మీడియా కన్వీనర్ శ్రీనివాస్‌పట్నాయక్, తుంపాల పరదేశి తదితరులు పాల్గొన్నారు.

73వ వార్డులో..

గాజువాక : పేదల గుండె చప్పుడు ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి అని ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి అన్నారు. 73వ వార్డు నవాబ్‌నగర్ సచివాలయం పరిధిలో శుక్రవారం నిర్వహించిన 'ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలంటే..' కార్యక్రమంలో ఆయన ప్రసంగించారు. సచివాలయం పరిధిలో సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాల కోసం రూ.28,49,19,074లను ఖర్చు చేశారని తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ గాజువాక సమన్వయకర్త ఉరుకూటి రామచంద్రరావు, 73వ వార్డు కార్పొరేటర్ భూపతిరాజు సుజాత, నాయకులు రెడ్డి జగన్నాథం, షఫీ, ఉమ తదితరులు పాల్గొన్నారు.

గుడివాడ అప్పన్నకాలనీలో..

అక్కిరెడ్డిపాలెం: రాష్ట్రంలో పేదల జీవితాల్లో వెలుగులు చూడటమే లక్ష్యంగా ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి పాలన సాగిస్తున్నారని ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి అన్నారు. పెదగంట్యాడ 06 సచివాలయం పరిధి గుడివాడ అప్పన్నకాలనీలో శుక్రవారం నిర్వహించిన ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలంటే కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. 68వ వార్డు వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జి గుడివాడ లతీష్ మాట్లాడుతూ సచివాలయ పరిధిలో డీబీటీ, నాన్ డీబీటీ ద్వారా లబ్ధిదారులకు రూ.27,67,13,171 అందజేశారన్నారు. అనంతరం గుడివాడ అప్పన్నకాలనీలో సంక్షేమ పథకాలు తెలియజేసే డిజిటల్ బోర్డును ఎమ్మెల్యే ఆవిష్కరించారు. వైఎస్సార్ సీపీ నాయకులు వరదాడ వెంకటరమణ, సంగ్రాన నూకరాజు, గుర్రం రాజేష్, గుర్రం త్రినాథ్, మహ్మద్ గౌస్, బి.సుధాకర్, కె.విజయ్ భాస్కర్, వెంకటరావు, కోటి, ఈశ్వరరావు, సయ్యద్ హుస్సేన్, అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

74వ వార్డులో..

పెదగంట్యాడ: రాష్ట్రంలో ముఖ్యమంత్రిగా జగన్ మోహన్‌రెడ్డి వచ్చిన తర్వాత సంక్షేమ పథకాలకు పునాది పడిందని, అవే పేదల ఇంటికి వెలుగులు తెచ్చాయని ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి అన్నారు. 74వ వార్డు టీజీఆర్ నగర్ సచివాలయ పరిధి వెంపళ్లనగర్ కమ్యూనిటీ హాల్ వద్ద కార్పొరేటర్ తిప్పల వంశీరెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలంటే కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఎన్ని పార్టీలు కలసి వచ్చినా వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ ప్రభంజనం తథ్యమన్నారు. ముందుగా పార్టీ జెండాను ఆవిష్కరించారు. అనంతరం సచివాలయంలో 21 కోట్ల రూపాయలు లబ్ధి చేకూర్చామని వివరించే డిజిటల్ బోర్డును ప్రారంభించారు. నాయకులు, గళ్లా శంకర్ సాయిరాం, విజయలక్ష్మి, రామలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ఇద్దరి జీవనోపాధికి గంగవరం పోర్టు సహకారం



టైలరింగ్ మెటీరియల్ దుకాణాన్ని ప్రారంభిస్తున్న గంగవరం పోర్టు అధికారులు

పెదగంట్యాడ: పేద ప్రజలు ఆర్థికంగా నిలదొక్కుకునేందుకు అదానీ గంగవరం పోర్టు, అదానీ ఫౌండేషన్ తమ వంతు సహకారం అందజేస్తోందని పోర్టు సీఎస్సార్ మేనేజర్ రమేష్‌బాబు అన్నారు. అదానీ గంగవరం పోర్టు, అదానీ ఫౌండేషన్ సీఎస్సార్ నిధులతో దిబ్బపాలెంలో లాస్య టైలరింగ్ మెటీరియల్ షాపు, దేవుడు కిరాణా అండ్ జనరల్ స్టోర్స్‌ను శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేవుడు దివ్యాంగుడు కావడంతో అతని భార్య కూలి పనులకు వెళ్తూ కుటుంబాన్ని నెట్టుకువస్తోందన్నారు. ఈ నేపథ్యంలో ఆ కుటుంబానికి ఆర్థిక ఆసరా కల్పించేందుకు దేవుడితో కిరాణా దుకాణం తెరిపించామన్నారు. అలాగే లాస్య శ్రీ అనే మహిళకు జీవనోపాధి కల్పించాలని ముగ్గురు మహిళల బృందం వచ్చి తమను కోరడంతో అదానీ ఫౌండేషన్ యాజమాన్యం ఆమెకు టైలరింగ్ మెటీరియల్ షాపు నడుపుకోవడానికి ఆర్థిక సాయం అందించిందని వివరించారు. కార్యక్రమంలో పోర్టు యాజమాన్య ప్రతినిధులు అచ్యుతరావు, నారాయణ్ తదితరులు పాల్గొన్నారు.


బైజూస్ ట్యాబ్‌లపై పిచ్చిరాతలు సిగ్గుచేటు




విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న చందు

గాజువాక : బడుగు బలహీనవర్గాలకు మెరుగైన విద్య నందించాలనే ఉద్దేశంతో విద్యార్థులకు ప్రభుత్వం అందించిన బైజూస్ ట్యాబ్‌లపై ఎల్లోమీడియా పిచ్చిరాతలు రాయడం సిగ్గుచేటని వైఎస్సార్‌సీపీ గాజువాక సమన్వయకర్త ఉరుకూటి రామచంద్రరావు (చందు) అన్నారు. గాజువాకలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. విద్యార్థులకు ఉచితంగా ఇచ్చిన ట్యాబ్‌లపై కూడా రాజకీయం చేయడం బాధాకరమన్నారు. ఏపీలో చంద్రబాబును సీఎం చేయాలనే ఆలోచనతో ఎల్లో మీడియా అత్యుత్సాహాన్ని ప్రదర్శిస్తోందన్నారు. బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ వర్గాల అభివృద్ధిని టీడీపీ అడ్డుకుంటోందన్నారు. ఎల్లో మీడియా విష ప్రచారాన్ని ప్రజలు తిప్పి కొట్టాలని కోరారు. సమావేశంలో కార్పొరేటర్లు బొడ్డు నర్సింహపాత్రుడు, రాజాన రామారావు, నాయకులు సిరట్ల శ్రీనివాస్, రెడ్డి జగన్నాథం, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

అమరజీవికి ఘన నివాళి



పొట్టి శ్రీరాములు చిత్రపటానికి పూలమాల వేస్తున్న ఎమ్మెల్యే నాగిరెడ్డి తదితరులు



పొట్టి శ్రీరాములుకు నివాళులర్పిస్తున్న మహాత్మాగాంధీ సేవా సంఘం ప్రతినిధులు

పెదగంట్యాడ: ఆంధ్ర రాష్ట్రం కోసం ఆమరణ నిరాహార దీక్ష చేసి, ప్రాణ త్యాగం చేసిన పొట్టి శ్రీరాములు సేవలను మరువలేమని ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి అన్నారు. పొట్టి శ్రీరాములు వర్థంతి సందర్భంగా బీసీ రోడ్డులోని టీఎస్ఆర్ ఫంక్షన్ హాల్లో శుక్రవారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మార్టుపూడి పరదేశి, కార్పొరేటర్ భూపతిరాజు సుజాత, రాజాన వెంకటరావు, పల్లా చినతల్లి, కులుకూరి మంగరాజు, గొందేశి వెంకటరమణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో..

76వ వార్డు పెదనడుపూరులోని జ్ఞాన మందిరంలో ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు బొడ్డు కృష్ణారావు, కార్యదర్శి కులుకూరి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో పొట్టి శ్రీరాములు వర్థంతి నిర్వహించారు. కులు కూరి మంగరాజు, బెల్లాల వెంకటరావు, నరసింహమూర్తి, తిరుపతిరావు తదితరులు పాల్గొన్నారు.

అగనంపూడి: అమరజీవి పొట్టి శ్రీరాములుకు మహాత్మాగాంధీ సేవా సంఘం నివాళులర్పించింది. 79వ వార్డు పాత అగనంపూడిలోని సత్రం కూడలిలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మహాత్మాగాంధీ సేవా సంఘం అధ్యక్షుడు చిత్తా రామారావు ఆధ్వర్యంలో పొట్టి శ్రీరాములు చిత్రపటానికినివాళులర్పించారు. కసిపల్లి శ్రీనివాసరావు, రమణ, ప్రకాష్ పాల్గొన్నారు.